www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -203 ఆదివారం 26 అక్టోబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# హైదరాబాద్‌లో ఆర్టీఏ మెరుపు దాడులు..

## ప్రైవేట్ బస్సులపై కొరడా.. పలు బస్సుల సీజ్

- కర్నూలు బస్సు అగ్నిప్రమాదం నేపథ్యంలో ఆర్టీఏ అప్రమత్తం
- హైదరాబాద్ వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్‌పై ముమ్మర తనిఖీలు
- బండ్లగూడలో 12 బస్సులపై కేసులు, 8 వాహనాల సీజ్



**హైదరాబాద్,అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
కర్నూలులో జరిగిన బస్సు అగ్ని ప్రమాదం ఘటన నేపథ్యంలో తెలంగాణ రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు కొన్నింటిని సీజ్ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలతో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు బెంబేలెత్తారు. **మిగతాది 2లో...**

# మద్యం మత్తు లో బైకర్ నిర్లక్ష్యం

## కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ

- బైక్ వెనుక కూర్చున్న ఎర్రిస్వామి అనే యువకుడ్ని ప్రశ్నించిన పోలీసులు
- బైక్‌ను బస్సు ఢీకొట్టలేదని తేలిన వైనం
- ముందుగా బైక్ స్కిడ్ అయి డివైడర్‌ను ఢీకొట్టిందని నిర్ధారణ
- కిందపడిన బైక్‌ను బస్సు ఈడ్చుకెళ్లడంతో మంటలు



కర్నూలు **అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం వెనుక ఉన్న మిస్టరీ వీడింది. తొలుత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, బైక్‌ను నేరుగా ఢీకొట్టడం వల్లే మంటలు చెలరేగాయని భావించగా, పోలీసుల దర్యాప్తులో అది తప్పని తేలింది. బైక్‌పై వెనుక కూర్చుని ప్రయాణిస్తూ స్వల్ప గాయాలతో బయటపడిన ఎర్రిస్వామిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. **మిగతాది 2లో...**

# 'మొంథా' తుపాను వస్తోంది...

## అప్రమత్తంగా ఉండండి

: సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

'మొంథా' తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్ జారీ



2లో.

## అమరులకు..ఉద్యమకారులకు

# తీరని అన్యాయం

- గత పదేళ్లలో వారికి సరిగా ఉద్యోగాలు ఇవ్వలేదు
- వారిని ఆదుకోవడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం
- అంతర్గతంగా తాను కొట్లాడినా న్యాయం జరగలేదు
- జాగృతి జనంబాట ప్రారంభంలో కవిత భావోద్వేగం



**హైదరాబాద్,అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారుల కోసం పోరాడలేకపోయామని, అమరవీరుల కుటుంబాలకు అనుకున్నంత న్యాయం చేయలేకపోయామని భావోద్వేగానికి లోనయ్యారు. **మిగతాది 2లో...**



# అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం..

- హరీశ్‌కు అడ్లూరి సవాల్
- కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అనడంపై మంత్రి అడ్లూరి ఫైర్
- హరీశ్ రావుకు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన మంత్రి
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న అడ్లూరి

2లో.



# జూబ్లీహిల్స్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

- కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బుద్ధి వస్తుంది
- లేదంటే అదే నిర్లక్ష్యంతో పాలన సాగిస్తారు
- పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రెండేళ్లలో కేసీఆర్‌ని తిట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏమి చేశారని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని చెప్పారు. మోసాన్ని మోసంతోనే జయించాలని కేటీఆర్ పేర్కొన్నారు. **మిగతాది 2లో...**

# చొరబాటుదారులను ఉపేక్షించేది లేదు

## బీహార్ ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ



పాట్నా,**అక్టోబర్: 25 (జర్నలిస్టు జర్నీ న్యూస్)**
బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఖగడియా జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతలు నేడు పోటాపోటీ ప్రచార సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ను వ్యతిరేకించిందంటూ 'ఇండియా' కూటమిపై **మిగతాది 2లో...**

## ఆధార్ లింక్ చేయకపోతే


# జీతాలు బంద్!

- తెలంగాణ ఉద్యోగుల వేతనాలకు ఆధార్ లింక్ తప్పనిసరి
- నిబంధన పాటించని ఉద్యోగుల జీతాలు నిలిపివేస్తామని హెచ్చరిక
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే ఈ నిర్ణయమన్న ఆర్థిక శాఖ
- రాష్ట్రంలో 10.14 లక్షల మంది ఉద్యోగులపై ఈ నిర్ణయ ప్రభావం
- గడువిచ్చినా సగం మంది కూడా వివరాలు నమోదు చేయని వైనం



# ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఇంటర్ విద్యావిధానంలో మార్పులు
- వచ్చే ఏడాది నుంచే అమల్లోకి కొత్త సిలబస్



హైదరాబాద్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఆయన మీడియాకు తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయని, ఇంగ్లీష్‌లో ఉన్నట్లుగానే మిగతా భాషల్లోనూ ప్రాక్టీకల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌లో మార్పులు జరగబోతున్నట్లు తెలిపారు**మిగతాది 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# హైదరాబాద్‌లో ఆర్టీఏ మెరుపు దాడులు..

(మొదటి పేజి తరువాయి)

రంగారెడ్డి జిల్లా బండ్లగూడ, వనస్థలిపురం ప్రాంతాల్లో ఆర్టీఏ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 60కి పైగా వాహనాలను తనిఖీ చేయగా, నిబంధనలు పాటించని 12 బస్సులపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు, భద్రతా ప్రమాణాలు లేని 8 బస్సులను అక్కడికక్కడే సీజ్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మరోవైపు సంగారెడ్డి జిల్లా ముత్తంగి ఓఆర్ఆర్ ఎగ్జిట్-3 వద్ద, రాజేంద్రనగర్ పరిధిలోని గగన్‌పహాడ్ వద్ద కూడా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులను ఆపి సోదాలు నిర్వహించారు. బస్సుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, మెడికల్ కిట్ల లభ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎల్బీనగర్‌లోని చింతలకుంట వద్ద కూడా పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు.ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలు రాబోయే రోజుల్లోనూ కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.

# చొరబాటుదారులను ఉపేక్షించేది లేదు

(మొదటి పేజి తరువాయి)

కేంద్రమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశానికి తరలిస్తామన్నారు. బిహార్‌లో జంగల్‌రాజ్ తిరిగి వస్తుందా? లేదా రాష్ట్రం అభివృద్ధి మార్గంలో కొనసాగుతుందా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు.

చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్ని యాత్రలైనా నిర్వహించ నివ్వండి. ఏం చేసినా.. వారిని ఆయన రక్షించలేరు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం. ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం. వారి స్వదేశానికి పంపిస్తాం అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కేవలం తన కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయని, కానీ.. ఎన్డీయే హయాంలో

నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. జంగల్‌రాజ్ తిరిగి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఇదిలావుంటే కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామన్నారు. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడియాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు.. పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు.

# ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజి తరువాయి)

. మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సిలబస్ మారబోతున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా విధానంలో మార్పులతో పాటు పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ల్యాబ్స్ , ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉంటాయి.. అలాగే, ఇంటర్ సిలబస్ లోనూ మార్పులు చేసినట్లు ప్రకటించారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బొటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ స్జబెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు. అలాగే, కొత్త కోర్స్ కోర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య చెప్పుకొచ్చారు. ఇంగ్లీష్ లో ఉన్నట్టు గానే మిగతా లాంగ్వేజెస్ లోనూ ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇకపై 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఉంటాయన్నారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ప్రతి సంవత్సరం 15 మార్కుల చొప్పున నిర్వహించనున్నారు. అంతేకాకుండా, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు.

# మద్యం మత్తు లో బైకర్ నిర్లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఇద్దరూ బైక్‌పై లక్ష్మీపురం నుంచి రాత్రి 2 గంటలకు బయలుదేరారు. ఎర్రిస్వామిని ఇంటి వద్ద దించేందుకు శివశంకర్ తుగ్గలి బయల్దేరాడు. మార్గమధ్యంలో కియా షోరూం వద్ద ఓ పెట్రోల్ బంకులో ఇంధనం నింపుకున్నారు. రోడ్డుపైకి వచ్చిన కొద్దిసేపటికే వారి బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. వేగంగా కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన ఎర్రిస్వామి, రోడ్డుపై ఎగిరిపడిన తన స్నేహితుడిని, రోడ్డు మధ్యలో ఉన్న బైక్ ను పక్కకి తీయాలని అనుకున్నాడు.శివశంకర్‌ను రోడ్డు పక్కకు లాగేందుకు ఎర్రిస్వామి ప్రయత్నిస్తున్న సమయంలోనే, ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చింది. రోడ్డు మధ్యలో పడి ఉన్న వారి బైక్‌ను చాలాదూరం ఈడ్చుకెళ్లింది. దాంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు మంటల్లో చిక్కుకోవడం చూసిన ఎర్రిస్వామి భయపడి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లిపోయాడు. కాగా, ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైనట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత నిన్న ప్రకటించిన విషయం విదితమే. మొదట ఇది రోడ్డు ప్రమాదంగా భావించినా, ఎర్రిస్వామి వాంగ్మూలంతో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత వచ్చింది.

# 'మొంథా' తుపాను వస్తోంది...

## అప్రమత్తంగా ఉండండి

**: సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ 'మొంథా' తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్**

**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై 'మొంథా' తుపాను విరుచుకుపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యూఏఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలెర్ట్‌ను ప్రస్తావిస్తూ, ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంటుందని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో 'మొంథా' తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. దీని ప్రభావం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఉంటుందని, 80 నుంచి 100 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు."ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ప్రతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి. తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. తీరప్రాంత ప్రజలకు తుఫాన్ తీవ్రతపై అవగాహన కల్పించి, వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకే అప్పగించారు.అన్ని ప్రధాన, మధ్య తరహా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి విడుదలను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి, సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచాలన్నారు. కాకినాడలో 'హాస్పిటల్ ఆన్ వీల్స్' సేవలను అందుబాటులో ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు.

# అమరులకు..ఉద్యమకారులకు తీరని అన్యాయం

(మొదటి పేజి తరువాయి)

ఉద్యమకారులకు న్యాయం జరిగేవరకు పోరాడనందుకు బహిరంగ క్షమాపణ చెప్పారు. కాగా, కవిత శనివారం నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. వరుసగా 4 నెలలపాటు ప్రజలతో ఉండేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. నిజామాబాద్ నుంచి జనంబాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజలు కోరుకుంటే కొత్త పార్టీని పెట్టేందుకు కూడా సిద్ధమని కవిత ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో కవిత శనివారం 'జాగృతి జనం బాట' పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించారు. ఈ యాత్రకు ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయామని అంగీకరిస్తూ, వారికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణ త్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు



అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపిగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా, వారి కోసం గట్టిగా కొట్లాడలేకపోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నానని కవిత అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వకపోతే రాబోయే ప్రభుత్వంతోనైనా ఇప్పించి తీరుతామని ఆమె హామీ ఇచ్చారు. 'సామాజిక తెలంగాణ' సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని? సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ' తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం ' అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్ధలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావాలని, సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కవిత పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

(మొదటి పేజి తరువాయి)

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షుడు తోట మహేష్ ముదిరాజ్, తన అనుచరులతో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మహేష్‌తో పాటు ఆయన అనుచరులకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరంమీడియాతో కేటీఆర్ మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో హామీలిచ్చి ఒక్క పైసా కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ఓటు కోసం కాంగ్రెస్ నేతలు ప్రమాణం చేస్తారని.. ఆ తర్వాత పట్టించుకోరని ఎద్దేవా చేశారు. మళ్లీ కేసీఆర్‌ని అధికారంలోకి తెచ్చుకోవటానికి.. జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తాము మోసం చేసినా తమకు ఓటు వేశారని.. ఆ పార్టీ నేతలు చెబుతారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులకి మధ్య సయోధ్య లేక కొట్టుకుంటున్నారని



విమర్శించారు. కాంగ్రెస్ నేతలు జాదూగాళ్లు అని దెప్పిపొడిచారు. అన్ని మతాల వారిని, అన్నివర్గాల వారిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆక్షేపించారు. మైనార్టీ సబ్ ప్లాన్ పెడతామన్నారని.. అది కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓటు అడగటానికి కాంగ్రెస్ నేతలు వస్తే బాకీ కార్డు చూపెట్టాలని సూచించారు. అవ్వా, తాతలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని అన్నారని.. ఇచ్చారా అని నిలదీశారు. మహిళలకు రూ. 2500 ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వాస్తవం కాలేదని, పేదల ఆశలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తగ్గాయి. ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5 భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫాతో పాటు అనేక పథకాలు అమలు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బకాయిలతో ముంచేసింది. వృద్ధులు, రైతులు, మహిళలు అందరిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం మోసపోయాం.. కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోవద్దు. అందుకే మేం కూడా జూబ్లీహిల్స్‌కు వచ్చి ప్రచారం చేస్తామని గ్రామల నుంచి రైతులు, ప్రజలు చెబుతున్నారని అన్నారు. మోసాన్ని మోసంతోనే జయించాలి. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారు. జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే నెల 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు.

# ఆధార్ లింక్ చేయకపోతే జీతాలు బంద్!

**తెలంగాణ ఉద్యోగుల వేతనాలకు ఆధార్ లింక్ తప్పనిసరి**

**హైదరాబాద్,అలక్టోబర్: 25 ప్రజావినికిడి,**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ఆర్థిక శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. ఉద్యోగులందరూ తమ ఆధార్ వివరాలను ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)తో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈరోజు (అక్టోబర్ 25) అర్ధరాత్రి వరకు గడువు విధించింది. గడువులోగా ఆధార్ వివరాలు నమోదు చేయని ఉద్యోగులకు ఈ నెల జీతాల చెల్లింపు నిలిపివేస్తామని తేల్చి చెప్పింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కలిపి సుమారు 10.14 లక్షల మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరి పేరు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్ వంటి వివరాలను ప్రతి నెలా 10వ తేదీలోగా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని గత నెలలోనే ఆర్థిక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఈ నెల 16వ తేదీ నాటికి సగం మంది ఉద్యోగులు కూడా తమ వివరాలను నమోదు చేయలేదు. దీంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. వివరాలు సమర్పించని వారి జీతాల బిల్లులను ప్రాసెస్ చేయవద్దని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వెనుక ప్రధానంగా ఉద్యోగుల వివరాల్లో పారదర్శకత లేకపోవడం, కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడమే కారణంగా తెలుస్తోంది. కొన్ని కార్యాలయాల్లో ఉద్యోగం మానేసినా లేదా అనధికారికంగా దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నా వారి పేర్ల మీద జీతాలు డ్రా చేస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఆధార్, పేరు, మొబైల్ నంబర్ వంటి వివరాలను అనుసంధానించడం ద్వారా అసలైన ఉద్యోగుల సంఖ్యను తేల్చవచ్చని, తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. పలుమార్లు సూచించినా కార్యాలయాలు స్పందించకపోవడంతో ఆర్థిక శాఖ ఈసారి గడువు విధించి హెచ్చరికలు జారీ చేసింది.

# అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం..

**హరీశ్‌కు అడ్లూరి సవాల్**

**కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అనడంపై మంత్రి అడ్లూరి ఫైర్**

**హరీశ్ రావుకు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన మంత్రి**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న అడ్లూరి**

**హైదరాబాద్,అక్టోబర్: 25 ప్రజావినికిడి,**

రాష్ట్ర కేబినెట్ సమావేశంపై మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన 'దండుపాళ్యం బ్యాచ్' వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ హరీశ్ రావుకు ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు తాము వస్తామని, చర్చకు మీరు వస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేటలో ఈరోజు మీడియాతో మాట్లాడిన అడ్లూరి లక్ష్మణ్.. హరీశ్ రావు వ్యాఖ్యలు చాలా బాధ



కలిగించాయన్నారు. "ఒక ఉద్యమ నాయకుడు అయి ఉండి కేబినెట్‌ను అలా సంబోధించడం సిగ్గుచేటు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో హరీశ్ రావు మంత్రిగా పనిచేశారు, ఆ విషయం ఆయన మరవొద్దు. మా కేబినెట్ మీటింగ్ ప్రజల అవసరాల కోసమే... అంతే తప్ప, దండుపాళ్యంలా దోచుకోవడానికి కాదు" అని ఆయన స్పష్టం చేశారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడటం దారుణమన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేతో, తన భజన మండలితో తనను తిట్టించడం ఎంతవరకు సమంజసమని హరీశ్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు కూడా కాకముందే ఇంతగా టార్గెట్ చేయడం సరికాదన్నారు. దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం లాంటి హామీలను బీఆర్ఎస్ నెరవేర్చిందా? అని నిలదీశారు. పదేళ్లలో ఒక్కరికైనా నియామక పత్రం ఇచ్చారా? అని అడిగారు.

"ముఖ్యమంత్రిని, మంత్రులను ఏకవచనంతో మాట్లాడటం సరికాదు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూనే మేము సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారు" అని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను కేంద్రం ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు ఆస్తులు, ఫామ్ హౌస్‌ల కన్నా దళితుల ఆత్మగౌరవమే ముఖ్యమని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్, గ్రామస్థాయి ఎన్నికల్లో ప్రజలు ఎవరికి మద్దతిస్తారో చూద్దామని అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 26 అక్టోబర్ 2025

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఛట్ పూజ సందర్భంగా 50 వేల మంది ఉత్తర భారతీయులకు 10 లారీల చెరుకు పంపిణీ



**ప్రజావినికిడి,(పటాన్చెరు):** భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్చెరు నియోజకవర్గం నిలుస్తోందని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ పురస్కరించుకొని శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పటాన్చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్పూర్, గుమ్మడిదల,బొంత పల్లి, ఖాజీపల్లి, తదితర ప్రాంతాలలో నివసిస్తున్న 50 వేల మంది ఉత్తర భారతీయులకు 10 లారీల చెరుకును సొంత నిధులతో కొనుగోలు చేసి ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం,ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం తగు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా పటాన్చెరువు సాకి చెరువు కట్ట పైన ఛట్ పూజ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. త్వరలో సాకి చెరువు కట్ట పైన సూర్య దేవాలయం, ఫంక్షన్ హాల్ నిర్మించబోతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని తెలిపారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం..

## ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్.. -నార్సింగి మున్సిపాలిటీలో 9 కోట్ల 55 లక్షలతో పలు శంకుస్థాపనలు..





**ప్రజావినికిడి, (రాజేంద్రనగర్):**
**అక్టోబర్ 25:** రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్మని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. నార్సింగి పురపాలక సంఘం పరిధిలో పలు అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. మొత్తం నాలుగు పనులకు సంబంధించి రూ.9 కోట్ల 55 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు, మరికొన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంచిరేవుల లోని గ్రీన్ ల్యాండ్స్ లో సి.సి రోడ్డు నిర్మాణనికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మంచిరేవులలో బీటి రోడ్డువెడల్పు, ఫుట్పాత్ నిర్మాణం పనులను 65 లక్షలతో ప్రారంభోత్సవం చేశారు. మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ను 4.5 కోట్లతో ప్రారంభించారు. గ్రీన్ ల్యాండ్స్ లో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లు,అండర్ డ్రైనేజ్ పనులను పూర్తి చేయాలి..

## హెచ్ఎండిఏ అధికారులను ఆదేశించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి..





**ప్రజావినికిడి, (రాజేంద్రనగర్):**
మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని సిసి రోడ్లు,అండర్ డ్రైనేజ్ పనులను పూర్తి చేయాలని హెచ్ఎండిఏ అధికారులను కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ లో భారత్ యూత్ క్లబ్ యువకులు,స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన సిసి రోడ్ పనులు అదేవిధంగా పెండింగ్ లో ఉన్న పలు పనులపై జిహెచ్ఎంసి అదేవిధంగా హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారంతో కలిసి విస్తృతంగా పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పనులు మంజూరు అయ్యి అర్ధార్థంగా ఆగిపోయిన 50 లక్షల రూపాయలు విలువ గల సిసి రోడ్ పనులు పున ప్రారంభించబడ్డాయని దీని ద్వారా దాదాపు గగన్ పహాడ్ నలుమూలలో బస్తీలలో రోడ్లు వేస్తారని ఇంకా మిగిలి ఉన్న పలుచోట్లలో రెండో విడతలో పనులు ప్రారంభమవుతాయని స్థానికులకు తెలియజేస్తూ నాణ్యత లోపాలు పాటిస్తూ ఎక్కడ రాజీ పడకుండా నాణ్యమైన రోడ్లు వేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది అదేవిధంగా అవసరమున్న చోట భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్ లైన్ నూతన పైప్ లైన్ కొరకు అధికారులచే పర్యవేక్షించడం జరిగింది అదేవిధంగా హైవే రోడ్డు ప్రాంగణం సరిహద్దు లో రోడ్డు దెబ్బతిని ప్రజలు రాకపోకలకు వాహనదారుల ఇబ్బందిగా ఉందని ఈ యొక్క విషయాన్ని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారితో కలిసి ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ సిబ్బందితో మాట్లాడి వీలైనంత తొందరగా పనులు ప్రారంభమయ్యే విధంగా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది నూతన రోడ్లు వేపిస్తున్న కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలుపు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత్ యూత్ క్లబ్ కమిటీ సభ్యులు స్థానిక బస్తీ నాయకులు డివిజన్లోని ముఖ్య నాయకులు కార్యకర్తలు జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ హెచ్ఎమ్డబ్ల్యూఏ %డ% ఎస్బి వినయ్ స్థానిక యువకులు బస్తీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# నూతన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి..





**ప్రజావినికిడి,(పటాన్చెర్):**
శనివారం రోజు పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జిహెచ్ఎంసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్ , ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణి, ఈఈ సురేష్ కుమార్, ఈ ఐ శివ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్ శ్రీనివాస్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బి ఈఐ అరుణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఎంజి రోడ్డు మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ నుండి నేషనల్ హైవే వరకు 1 కోటి 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న నూతన రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. ప్రస్తుతం రోడ్డు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నూతన మార్కెట్ రోడ్ ఇంద్రేశం రోడ్లలో భారీ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని గమనించి,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే రానున్న ఛత్ పూజ సందర్భంగా పటాన్చెరులోని శాంతినగర్,శ్రీరామ్ నగర్,బాలాజీ నగర్, ఆల్విన్ కాలనీ, బండ్లగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఛత్ పూజ ఘాట్ల వద్ద సౌకర్యాలు కల్పించాలని, జి.హెచ్.ఎం.సి సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు.

# జగద్గురు శృంగేరి పీఠాధిశ్వరులు శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## పటాన్చెరులో శివపార్వతుల కళ్యాణానికి విచ్చేయాలని వినతి



**ప్రజావినికిడి,( పటాన్చెరు):** విజయ యాత్రలో భాగంగా హైదరాబాద్ నల్లకుంట శంకరమఠంలో గల శ్రీ శృంగేరి శంకర మఠానికి విచ్చేసిన జగద్గురు దక్షిణామ్నాయ శృంగేరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారిని శనివారం ఉదయం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఫల సమర్పణ చేసి పటాన్చెరు నియోజకవర్గ ప్రజలను ఆశీర్వదించాలని కోరారు. అతి త్వరలో పటాన్చెరులో నిర్వహించబోయే శ్రీ శివపార్వతుల కళ్యాణం,విశేష గురువందన సభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని స్వామివారికి విన్నవించారు. ఇందుకు సమ్మతించిన జగద్గురు పీఠాధిపతులు తప్పకుండా విచ్చేస్తామని తెలియజేశారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200 రూపాయగా దేవాలయాలు నిర్మించినట్లు స్వామి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం శంకరమఠం తరఫున ఎమ్మెల్యే జిఎంఆర్ కు ప్రత్యేక సన్మానం ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వామనభట్ల ప్రకాశ శర్మ,శృంగేరి పండితులు వ్యాసోజ్జల గోపీకృష్ణ శర్మ, సభాపతి చంద్రప్రకాశ శర్మ,తదితరులు పాల్గొన్నారు.

# కార్మికకల సమస్యలను పరిష్కారమే సిఐటియు లక్ష్యం..

## - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్..




**ప్రజావినికిడి, (శంషాబాద్):అక్టోబర్ 25,** అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడమే సిఐటియు లక్ష్యం అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అన్నారు. సిఐటియు మండల మహాసభ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ పాల్గొని మాట్లాడుతూ, శంషాబాద్ లో ఉన్నటువంటి అన్ని రంగాల కార్మికులు సిఐటియు ముందుండి పోరాటం చేసి సమస్యలను పరిష్కారం చేయడమే సిఐటియు లక్ష్యం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక మరియు కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం పోరాడి కనీస వేతనాలు ఉద్యోగ భద్రత ఈఎస్ఐపీఎఫ్ పర్మనెంట్ ఇన్సూరెన్స్ లాంటి సమస్యలను పరిష్కరించే దిశగా ఉంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో భాగంగా నాలుగు కోడ్ తెచ్చింది ఈ కోడ్ లను ఎత్తివేయాలని అన్నారు. నాలుగు రకాలుగా ఉన్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చింది ఇలాంటి కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న కొడుకులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తర్వాత సిఐటియు మండల కన్వినింగ్ కమిటీ 9 మందితో ఎన్నుకోవడం జరిగింది సిఐటియు మండల కన్వీనర్ గా నీరటి మల్లేష్ ను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో నాగేష్,ప్రవీణ్,నర్సింగ్ రావు,జయేందర్, ఇందిరా,సుజాత, శోభ,స్వప్న,పవన్ కుమార్,భాను చందర్,రవి,రావేలా, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్ లో ఈసీసీఈ డే కార్యక్రమం..

## పిల్లలలో ఉత్సాహం, తెలివితేటలు మెరుగుపరచడానికి నిర్వహణ..

## పిల్లల ప్రదర్శన చూసి మురిసిపోయిన తల్లిదండ్రులు..




**ప్రజావినికిడి,(షాద్ నగర్):** ఫరూఖ్ నగర్ మండల పరిధిలో బూర్గుల గ్రామంలో అంగన్వాడి సెంటర్ లో ఈసీసీఈ డే కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ రమాదేవి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చదువుతోపాటు వారి ఎదుగుదల గురించి, తదితర వాటి గురించి తల్లులతో చర్చించారు. ప్రతిరోజు పిల్లలను అంగన్వాడి సెంటర్ కు పంపించాలని సూచించారు. అనంతరం చేతి శుభ్రత,పరిసరాల శుభ్రత,వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పిల్లలు చదువు, ఆటలు,పాటలు వారి తల్లిదండ్రుల సమక్షంలో చూడముచ్చటగా ప్రదర్శించారు. పసిపిల్లల ప్రతిభను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ సందర్భంగా టీచర్ రమాదేవి మాట్లాడుతూ,పిల్లలకు చదువుతోపాటు ఆటలు,పాటలు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పిల్లలలో ఉత్సాహం నింపడానికి మరియు తెలివితేటలు మెరుగుపడే విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం స్వప్న అనురాధ శ్రావణి శరణ్య ప్రవీణ మధు లావణ్య తదితరులు పాల్గొన్నారు.


## చలో ఏటూరునాగారం కరపత్రాలు అవిష్కరణ



**ప్రజావినికిడి,(వాజేడు):అక్టోబర్ 26,** వాజేడు మండల కేంద్రంలో నవంబర్ 3,న ఆదివాసీ సంఘాలు తలపెట్టిన చలో ఏటూరునాగారం, లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించి వారికి. ఆదివాసీ,రిజర్వేషన్లు నిలుపుదల చెయ్యాలని.కోరుతూ ఐటిడిఎ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరుతూ, మండల కేంద్రంలో కరపత్రాలు అవిస్కరించారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ,ఆదివాసీ జెఎసి నాయకులు. కబ్బాక.శ్రావణ్,కాపుల సమ్మయ్య,కోర్స నర్సింహమూర్తి,వాసం నాగరాజు,పర్శిక సతీష్,పాయం జానకి రమణ, బోదెబోయియిన సురేష్,చాప లక్ష్మణ్, టింగ బుచ్చయ్య, ఇండ్ల సమ్మయ్య మెడెం,నాగరాజు తొర్రెం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.ద

## ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం..

### సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు..



**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):**జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలలో ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీ...సోషల్ మీడియాలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ పైన చేస్తున్న దుష్ప్రచారం నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,మాజీ ఎమ్మెల్యేలు హర్ష వర్ధన్ రెడ్డి,దాస్యం వినయ్ భాస్కర్,బిసి కమిషన్ మాజీ మెంబెర్ కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి సునీతమ్మ గెలుపు కొరకు ఎన్నికల ప్రచారం..

### మాగంటి అక్షర,దిశిరల ఎన్నికల ప్రచారం..

### ప్రచారంలో పాల్గొన్న ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..





**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపు కొరకు మాగంటి అక్షర,దిశిరలతో కలిసి సోమాజిగూడ డివిజన్లో ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్ బస్తీలలో ఇంట్టింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాట్లాడుతూ,18 ఏళ్ల నిండిన మహిళకు 2500 ఇస్తామని, అమ్మాయిల స్కూటీలు,పెళ్లిచేసుకునే యువతులకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఓట్లు దండుకున్నారేతప్ప,పథకాలను అమలు చేయలేరని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ఇచ్చిన పెన్షన్లను,కళ్యాణ లక్ష్మిలను,షాదీ ముబారక్ వంటి పథకాలను సరిగ్గా అమలు చేయలేకపోతున్నారని ఎన్నికల్లో కాంగ్రెస్కు బుద్ధి చెప్పి,బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతమ్మను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచారంలో భూత్ ఇంచార్జిలు,స్థానిక నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## రాక్ టౌన్ సొసైటీ ఎన్నికలు వాయిదా వేయండి..

### ఎన్నికల అధికారికి పలువురు సభ్యుల వినతి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**నవంబర్ రెండో తేదీన జరిగే రాక్ టౌన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలను రెండు వారాలు వాయిదా వేయాలని పలువురు సొసైటీ సభ్యులు ఎన్నికల అధికారి చతుర్వేదిని కోరారు.శనివారం సొసైటీ కార్యవర్గ సభ్యులు వెంకట్ రెడ్డి, ఆల రవీందర్ రెడ్డి,సభ్యులు ఇంద్రారెడ్డి,కె.శ్రీనివాస్ రెడ్డి,కొండల్ రెడ్డి, దాసరి పవన్ తదితరులు సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ని కలిసి 60 మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.సొసైటీ ఎన్నికలు ఏకపక్షంగా, నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, మూడోవంతు సభ్యుల హాజరు లేకుండానే జనరల్ బాడీ నిర్వహించి ఎన్నికల ప్రక్రియకు నిర్ణయాలు చేశరని ఆరోపించారు. సొసైటీ లో ఉన్న 850 మంది సభ్యులలో కేవలం 72 మంది సభ్యులు మాత్రమే జనరల్ బాడీ సమావేశానికి హాజరయ్యారని, ఎన్నికల తేదీని ప్రకటించిన తర్వాత కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టి ఈనెల 23న ఓటర్ల తుది జాబితా ఫైనల్ చేశారని అన్నారు. ఎన్నికల ప్రక్రియ,ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని,వీటిని సరిదిద్దకుండానే హడావుడిగా ఎన్నికలు నిర్వహించడం సరైంది కాదని అన్నారు.ఓటర్ల జాబితాను పూర్తి చేసిన తర్వాతే ఎన్నికల తేదీని ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. రేపటి నుంచి జరిగే నామినేషన్ల ప్రక్రియను ఆపాలని,ఎన్నికల తేదీని అదనంగా రెండు వారాలకు వాయిదా వేయాలని వారు డిమాడ్ చేశారు.

## మండలంలో అటవీ అభివృద్ధి రాష్ట్ర చైర్మన్ పర్యటన

### రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య పర్యటన..





**ప్రజావినికిడి, (వాజేడు):అక్టోబర్ 26,**
ములుగు జిల్లా వాజేడు మండలం లో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు పోదేం వీరయ్య మండలంలోపర్యటించారు. టేకులగుడెం గ్రామంలో కలియ తిరుగుతూ పరిస్థితులను అలాగే ఇందిరమ్మ ఇల్లు ఎంతవరకు పూర్తి అయ్యాయని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో కొన్ని స్లాబ్ అయ్యాయి కొన్ని స్లాబ్ లెవల్ కొన్ని లెంటల్ బేస్మెంట్ లెవల్ లో ఉన్నాయనిగ్రామస్తులు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఈ గ్రామాన్ని పైలేట్ ప్రాజెక్ట్ క్రింద తీసుకొని గ్రామం లోని ఉన్న ప్రతి కుటుంబానికి ఇల్లు మజురు చేసింది.అయితే ఇంకా కొన్ని పెండింగ్ లో ఉన్నాయి అని. ఇందిరమ్మ ఇల్లు రాని వారికి కూడా వచ్చే విధంగా కృషి చెస్తానని మాట ఇవ్వడం జరిగింది.ఇందిరమ్మ ఇల్లు రాని వారందరిని మీ యొక్క ధరఖాస్తులు అందించమని నేను వెళ్ళిన తరువాత రోడ్లు భావనాల శాఖ మత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాట్లాడి పరిస్థితిని వారికి వివరిస్తాను అని అన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ దగ్గరకు వెళ్ళి లబ్ధిదారులతో మాట లాడటం జరిగింది.అలాగే ఇల్లు రాని వారి కుటుంబాలను కూడా కలిసి వారికి భరోసా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు బొల్లె డెనార్ధన్,మండల నాయకులు పూనెం రాంబాబు,దనిశెట్టి రాంబాబు,అటవీ శాఖ అధికారులు,మండల అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,గ్రామస్థులు తదితరుల పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు

## ఐలాపూర్ మాణిక్ యాదవ్ విస్తృత ప్రచారం..



**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):**
?శనివారం రోజు జూబ్లీహిల్స్ బై ఎలక్షన్లో భాగంగా బూత్ నంబర్ 385 లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ విస్తృతంగా ప్రచారం చేశారు.?ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి, బీఆర్ఎస్ అభ్యర్థి అయిన మాగంటి సునీత ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి బిఆర్ఎస్ గెలుపు అత్యంత అవసరమని ప్రజలకు హామీ ఇచ్చారు.కాంగ్రెస్ అరాచక పాలన ఆగి,ప్రజా సంక్షేమం రావాలంటే 'కారు'గుర్తుకు ఓటు వేయండి!
?హైడ్రా (హైడ్రా) ఆగాలంటే 'కారు' గెలవాలి!

బిఆర్ఎస్ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఆగిపోకుండా,కాంగ్రెస్ ప్రభుత్వ అస్తవ్యస్త పాలన (హైడ్రా)ను అరికట్టాలంటే జూబ్లీహిల్స్లో కారు గుర్తుకే ఓటు వేయాలి.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలనలో అమలు కావడం లేదు.ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలంటే బీఆర్ఎస్ను గెలిపించాలి.రైతులకు రక్షణ రావాలంటే 'కారు' గెలవాలి.బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన రైతు బీమా,పంట పెట్టుబడి సాయం (రైతుబంధు) వంటి మహత్తర పథకాలు తిరిగి సక్రమంగా, యూనియన్గా (సమగ్రంగా) అమలు కావాలంటే బీఆర్ఎస్ గెలవాలి.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు సరైన సాయం అందడం లేదు,కరెంట్ కష్టాలు పెరిగాయి. రైతు వ్యతిరేక కాంగ్రెస్ను ఓడించాలి.పేద ప్రజల బతుకులు మారాలంటే 'కారు' గెలవాలి..బిఆర్ఎస్ పేదలకు ఇళ్లు,పింఛన్లు, నిరంతర అభివృద్ధి వంటి పథకాల ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత బీఆర్ఎస్దే..ఈ పథకాలు నిరంతరాయంగా అందాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలి.కాంగ్రెస్ హామీలిచ్చి పేదలను మోసం చేస్తున్న కాంగ్రెస్, సంక్షేమ పథకాల అమలులో తీవ్ర జాప్యం చేస్తోంది. పేదల పట్ల చిత్తశుద్ధి కాంగ్రెస్కు లేదు.అభివృద్ధి ఆగకుండా జరగాలంటే 'కారు' గెలవాలి.బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ను రాష్ట్రంలోనే అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి మాగంటి గోపీనాథ్ చేసిన సేవలను కొనసాగించాలంటే, ఆయన సతీమణి మాగంటి సునీత కి ఓటు వేయాలి..

విద్యుత్ కోతలు, కరెంట్ కష్టాలు పోవాలంటే 'కారు' గెలవాలి..బిఆర్ఎస్ 24 గంటల ఉచిత కరెంట్ అందించిన బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుదాం..

కాంగ్రెస్ కాంగ్రెస్ వచ్చాక తెలంగాణలో కరెంటు కోతలు పెరిగాయి,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,కటకం శివశంకర్,సందీప్ గోస్వామి,మహేష్, సన్నీ,సతీష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

### మద్యం షాపుల డ్రాకు తొలగిన అడ్డంకులు

### 27న యధావిధిగా కలెక్టర్ల సమక్షంలో డ్రాలు

### ఏర్పాట్లు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు



హైదరాబాద్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,** తెలంగాణలో మద్యం షాపుల డ్రాకు అడ్డంకులు తొలగిపోయాయి. వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 27న యధావిధిగా మద్యం షాపుల డ్రా పక్రియను ఎక్సైజ్ శాఖ నిర్వహించనుంది. కాగా, వైన్ షాపుల కేటాయింపు కోసం గడువు ముగిసిన తర్వాత కూడా దరఖాస్తులు తీసుకున్నారని పేర్కొంటూ ఐదుగురు మద్యం వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్పై శనివారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నెల 18వ తేదీ వరకు ఉన్న మద్యం టెండర్ల గడువును 23వ తేదీ వరకు పెంచారని పిటిషనర్ తరఫు న్యాయవాదాలు హైకోర్టుకు తెలిపారు. 23వ తేదీకి పెంచడం వల్ల ఐదువేలకు పైగా దరఖాస్తులు అదనంగా వచ్చాయని వివరించారు. ఇది తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్టికల్ 12 (5) ప్రకారం గడువు పెంచడానికి అవకాశం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఈ నెల 23న జరగాల్సిన లక్కీ డ్రాను కూడా 27వ తేదీకి పొడిగించారని తెలిపారు. ప్రభుత్వం తరుపున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. గడువు పెంచడం అనేది తెలంగాణ ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయమని తెలిపారు. గడువు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రభుత్వ వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు మద్యం దుకాణాల డ్రా పక్రియ నిర్వహించేందుకు ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. హైకోర్టు నుంచి మద్యం షాపుల డ్రాకు అనుమతి రావడంతో డ్రా పక్రియ

ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు 27న మద్యం షాపుల డ్రాకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా సోమవారం ఉదయం 11 గంటలకు మద్యం షాపుల డ్రా ప్రకియ నిర్వహించ నున్నారు. కాగా, తెలంగాణలోని 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి లైసెన్స్లు జారీ చేయనున్నారు. డ్రా ఏర్పాట్లను పూర్తి చేయాల్సిందిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం షాపుల కోసం భారీ స్థాయిలో 95,137 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల వారీగా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారులు, ప్రజల సమక్షంలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా మద్యం షాపుల డ్రా పక్రియ కొనసాగనుంది. ఈ డ్రా ద్వారా కొత్త లైసెన్స్దారుల ఎంపిక జరగనుంది. అదిలాబాద్లో 40 మద్యం షాపులకు 771 దరఖాస్తులు, కోమురం భీం అసిఫాబాద్లో 32 షాపులకు 680, మంచిర్యాలలో 73 షాపులకు 1712, నిర్మల్లో 47 షాపులకు 3002, జగిత్యాలలో 71 షాపులకు 1966, కరీంనగర్లో 94 షాపులకు 2730, పెద్దపల్లి 77 షాపులకు 1507, రాజన్న సిరిసిల్లలో 48 షాపులకు 1381, ఖమ్మంలో 122 షాపులకు 4430, కొత్తగూడెం 88 షాపులకు 3922, జోగులాంబ గద్వాలలో 36 షాపులకు 774, మహబూబ్నగర్లో 90 షాపులకు 2487, నాగర్కర్నూల్లో 67 షాపులకు 1518, వనపర్తిలో 37 షాపులకు 757, మెదక్లో 49 షాపులకు 1920, సంగారెడ్డి 101 షాపులకు 4432, సిద్దిపేటలో 93 షాపులకు 2782, నల్లగొండ 155 షాపులకు 4906, సూర్యపేట్లో 99 షాపులకు 2771, యాదాద్రి భువనగిరిలో 82 షాపులకు 2776, కామారెడ్డి 49 షాపులకు 1502, నిజామాబాద్ 102 షాపులకు 2786, మల్కాజిగిరిలో 88 షాపులకు 5168, మేడ్చల్లో 114 షాపులకు 6063, సరూర్నగర్లో 134 షాపులకు 7845, శంషాబాద్లో 100 షాపులకు 8536 వికారాబాద్ 59 షాపులకు 1808, జనగామాలో 47 షాపులకు 1697, భూపాలపల్లి 60 షాపులకు 1863, మహబూబబాద్లో 59 షాపులకు 1800, వరంగల్ రూరల్లో 63షాపులకు 1958, వరంగల్ అర్బన్లో 65 షాపులకు 3175 దరఖాస్తులు వచ్చాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఈ దశాబ్దం మోదీదే

## సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు

## ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాల అమలు

## జాతీయవార్తా సంస్థ ఇంటర్వ్యూలో చంద్రబాబు




అమరావతి,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,** ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఎన్నికల హామీ 'సూపర్ సిక్స్'ను విజయవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే
విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు. 'భారత్‌లో ఎంతో ఆసక్తిని కలిగించే అంశాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాని మోదీ 2000 సంవత్సరం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఎన్నికల్లో విజయం సాధిస్తూనే ఉంటారు. గతంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లుగా ప్రధానిగా కొనసాగుతున్నారు. మరో నాలుగు సంవత్సరాలు ఆయనే ఉంటారు. ఈ దశాబ్దం మోదీ (ఖఓ ఓనీటతి)దే. అంటే ఆటోమెటిగ్గా భారతీయులదే' అని చంద్రబాబు వెల్లడించారు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై చంద్రబాబు మాట్లాడారు. వాటివల్ల ప్రజల సేవింగ్స్ పెరుగుతాయని తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగం, ఇతర వ్యాపారవేత్తలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ దేశ తలసరి ఆదాయంలోనైనా ఆ దేశంలో నివసించే భారతీయులదే ఆధిపత్యం
అని ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు పలువురు వ్యాపారవేత్తలతో భేటీ అయ్యారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. వచ్చే నెలలో ఆర్సెలార్‌మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఎ÷-లాంట్‌కు ఆంధ్రాలో శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, ఉద్యానరంగం, లాజిస్టిక్స్, రాజధాని నగరం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 750 వరకు సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామంటూ రియల్ టైమ్ గవర్నెన్స్ గురించి పేర్కొన్నారు. అలాగే తెలుగు కమ్యూనిటీ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఒకరోజు ఈ గ్రహంపై అత్యంత ప్రభావవంతమైన సమాజంగా తెలుగు కమ్యూనిటీ నిలుస్తుందని, ఆ దిశగా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు. గత 15 నెలల్లో తమ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించిందని, మరో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

# హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

## : సెల్ ఫోన్ దొంగలపై కాల్పులు జరిపిన డీసీపీ చైతన్య

హైదరాబాద్**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
హైదరాబాద్ నగరంలో కాల్పుల కలకలం రేగింది. శనివారం సాయంత్రం చాదర్‌ఘాట్ ప్రాంతంలో ఇద్దరు సెల్ ఫోన్ దొంగలపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సాయి చైతన్య స్వయంగా కాల్పులు జరిపారు. తనపై కత్తితో దాడికి యత్నించడంతో ఆయన ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు దొంగలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, డీసీపీ సాయి చైతన్య శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం ముగించుకుని తిరిగి తన కార్యాలయానికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఒకరి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోవడాన్ని ఆయన గమనించారు. వెంటనే అప్రమత్తమైన డీసీపీ, తన



గన్‌మెన్‌తో కలిసి వారిని పట్టుకునేందుకు వెంబడించారు. ఈ క్రమంలో దొంగల్లో ఒకరు డీసీపీపై కత్తితో దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో డీసీపీ కిందపడిపోయారు. అనంతరం ఇద్దరు దొంగలు పారిపోయేందుకు ప్రయత్నించగా... డీసీపీ, గన్ మెన్ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దాంతో దొంగలు గాయపడి, పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. స్వల్పంగా గాయపడిన డీసీసీ సాయి చైతన్యకు మలక్ పేట ఆసుపత్రిలో చికిత్స అందించారు.
పట్టుబడిన నిందితుడి నేర చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విధి నిర్వహణలో డీసీపీ సాయి చైతన్య చూపిన చొరవ, ధైర్యాన్ని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 14వేల అంగన్వాడీ టీచర్ హెల్పర్ల నియామకం

## గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లకు నియామక పత్రాల అందచేత -వెల్లడించిన మంత్రి సీతక్క





హైదరాబాద్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
త్వరలో 14వేల అంగన్వాడీ టీచర్ హెల్పర్ల నియామకాన్ని చేపట్టబోతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకుందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఎన్నో సవాళ్లు ఉన్నా ఆకాశాన్ని చీల్చుకొని అంతరిక్షం వరకు మహిళలు చేరుకుంటున్నారని ఉద్ఘాటించారు. ఐసీడీఎస్ సేవలకు భారతదేశంలో దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రాణం పోశారని నొక్కిచెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలని శనివారం మంత్రి సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్ వన్ సూపర్‌వైజర్లుగా నియమితులైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో మంత్రి సీతక్క ముచ్చటించారు. ఈరోజు 181 మంది సూపర్‌వైజర్లుగా నియామక పత్రాలు అందుకున్నారని చెప్పుకొచ్చారు. వేల మందితో పోటీపడి మీరు ఈ కొలువులు సాధించారని తెలిపారు. మీ నిరీక్షణలు ఫలించాయని అన్నారు. మీ ఉద్యోగ కలలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని ఉద్ఘాటించారు. ప్రజల ఆశలు, అవసరాల మేరకు మీ వృత్తి ధర్మం ఉండాలని సూచించారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ ప్రతి మహిళకు గౌరవం, ప్రతి చిన్నారికి సంరక్షణ ఉండాలనే లక్ష్యంతో ఐసీడీఎస్ సేవలను, అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారని గుర్తుచేశారు. అంగన్వాడీ కేంద్రాలకు తెలంగాణలోనే మొదటిసారిగా ప్రారంభించారని వివరించారు. 1970లో మహబూబ్‌గర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అంగన్వాడీ సేవలను ప్రారంభించారని తెలిపారు. అక్కడ సక్సెస్ కావడంతో దేశవ్యాప్తంగా అంగన్వాడీ సేవలను ఇందిరా గాంధీ విస్తరించారని పేర్కొన్నారు మంత్రి సీతక్క.'అంగన్వాడీ హెల్పర్ నుంచి మహిళా శాఖ సెక్రెటరీ వరకు ఈరోజు కొలువులు ఉన్నాయంటే అదంతా ఇందిరాగాంధీ చలువే. అందుకే ప్రతి ఒక్క మహిళ ఇందిరా గాంధీకి రుణపడి ఉండాలి. మన రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలను పటిష్ట పరుస్తున్నాం. పౌష్టికాహారానికే అంగన్వాడీ కేంద్రాలను పరిమితం చేయకుండా.. ప్రాథమిక విద్యను సైతం చిన్నారులకు అందజేస్తున్నాం. అమ్మ ఆప్యాయతకు నిలయాలుగా అంగన్వాడీ కేంద్రాలు మారుతున్నాయి. అంగన్వాడీ చిన్నారులకు 57 రకాల ఆట వస్తువులు, యూనిఫామ్‌లు ఇస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. మన దేశ భవిష్యత్తు అంగన్వాడీ కేంద్రాల్లోనే ఉంది. అందుకే ప్రతి ఒక్క సూపర్‌వైజర్ తన వృత్తి ధర్మాన్ని నిక్కచ్చిగా పాటించాలి' అని సూచించారు మంత్రి సీతక్క. 'ఒక్కో సూపర్‌వైజర్ కింద 25 అంగన్వాడీ కేంద్రాలు ఉంటాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ఎక్కడా చిన్న లోపం లేకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత మీదే. నియామక పత్రాలు అందుకొని ఈరోజు నుంచి మీరు మహిళా శిశు సంక్షేమ శాఖలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. మీ ఉద్యోగ బాధ్యతల్లో ఇది ప్రాథమిక దశ... ఎలాంటి తప్పటడుగులు వేయొద్దు. పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. తెలంగాణలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలి. మెరుగైన, బలమైన తెలంగాణ నిర్మాణంలో మీరంతా భాగస్వాములు కావాలి. అంగన్వాడీ చిన్నారులపై కేవలం సానుభూతి ఉంటే సరిపోదు. అంగన్వాడీ సిబ్బందికి ఎన్నో రకాల ప్రయోజనాలు కల్పిస్తున్నాం' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# చాదర్‌ఘాట్ కాల్పుల్లో గాయపడ్డ ఇద్దరు దొంగలు

## ఘటనా స్థలిని పరిశీలించిన సిపి సజ్జన్నార్



హైదరాబాద్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,** హైదరాబాద్ చాదర్‌ఘాట్ కాల్పుల ఘటనలో ఇద్దరు దొంగలు గాయపడ్డారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఘటనా స్థలిని పరిశీలించిన అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. గాయపడి, పోలీసులకు చిక్కిన దొంగ ఒమర్‌పై 25 కేసులతో పాటు రౌడీషీట్ ఉందని సీపీ తెలిపారు. దొంగలను పట్టుకునే క్రమంలో డీసీపీ చైతన్య రెండు రౌండ్లు కాల్పులు జరిపారని చెప్పారు. సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను డీసీపీ చైతన్య, ఆయన గన్‌మ్యాన్ గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దొంగలు.. గన్‌మ్యాన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో గన్ మ్యాన్, డీసీపీ చైతన్య కింద పడిపోయారు. వెంటనే తేరుకున్న డీసీపీ, గన్‌మెన్ దొంగలపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారు. నిందితుడు ఒమర్‌పై రెండు సార్లు పీడీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2016లో కామటిపురం పీఎస్‌లో నమోదైన పీడీ యాక్టు కేసులో ఏడాది జైల్లో ఉన్నాడు. 2020లో హుస్సేనీ ఆలమ్ పీఎస్‌లో పీడీ యాక్ట్ కేసులో ఏడాదిపాటు చంచల్‌గూడ జైల్లో ఉండి బయటకు వచ్చిన తర్వాత కూడా ఒమర్ ప్రవర్తన మారలేదు. ఆ తర్వాత కాలాపత్తర్ పీఎస్‌లో రెండు కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల దుశ్చర్య

## ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు యువకుల హత్య

రాయ్‌పూర్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,** ఓవైపు లొంగుబాట్లు మరోవైపు, మావోల ఏరివేత జరగుతున్నా వారు తమ ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. స్థానికుల్లో భయాందోళన సృష్టిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి వ్యక్తులను మావోయిస్టులు దారుణంగా హత్య చేశారు. శుక్రవారం రాత్రి ఉసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నేల కాంకేర్ గ్రామానికి చెందిన రవి కట్టం (25), తిరుపతి సోడి (38) లను ఎత్తుకెళ్లిన మావోయిస్టులు..ప్రజాకోర్టు నిర్వహించి హత్య చేశారు. వీరు పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తున్నారని, అందుకే హతమార్చామని చెప్పారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మావోలు లొంగిపోవాలని, హింసకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

---------------

# డ్రగ్స్‌పై యువతలో పోలీసుల చైతన్యం

భద్రాచలం,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,** అశ్వారావుపేట పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్బంధ తనిఖీలు చేపట్టారు. 'చైతన్యం- డ్రగ్స్ పై యుద్ధం' అనే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో దస్త్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 4 కార్లు, 6 ట్రాక్టర్లు, రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు సంబంధించిన అన్ని దస్త్రాలతోపాటు వాహనాలను నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సీఐ సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే పోలీస్ శాఖ తీసుకునే చర్యలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అమ్మకం, వాడకం రెండూ నిషేధమని హెచ్చరించారు.

# హైదరాబాదులో రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసు... ఏడుగురికి జైలు శిక్ష

**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**




హైదరాబాద్‌లోని కార్పొరేషన్ బ్యాంకులో సుమారు రూ.4.9 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని సీబీఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే... కార్పొరేషన్ బ్యాంక్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో అప్పటి సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన టి. చంద్రకాంత్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఈ కేసులో రుణాలు పొందిన ప్రైవేటు వ్యక్తులైన వి.ఎన్.ఎస్.సి. బోస్, వి. రాజశ్రీ, కొండా శేఖర్ రెడ్డి, ఎన్.వి.పి. నంద కిశోర్, హెచ్. రాజశేఖర్ రెడ్డిలకు ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.55,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నకిలీ, కల్పిత పత్రాల ఆధారంగా రూ.4.9 కోట్ల విలువైన గృహ రుణాలను మంజూరు చేసి బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై సీబీఐ 2004 సెప్టెంబర్ 29న చంద్రకాంత్‌తో సహా 16 మందిపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ జరిపిన సీబీఐ, 207 మార్చి 30న చంద్రకాంత్‌తో పాటు మరో 11 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులందరూ కుమ్మక్కై, బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు పత్రాలతో రుణాలు పొంది బ్యాంకుకు నష్టం కలిగించారని విచారణలో తేలింది. రెండు దశాబ్దాలకు పైగా సాగిన సుదీర్ఘ విచారణ అనంతరం, హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి 2025 అక్టోబర్ 24న తీర్పు వెలువరించి ఏడుగురిని దోషులుగా తేల్చారు. ఇదిలా ఉండగా, ఘజియాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా అక్టోబర్ 18న మరో బ్యాంకు మోసం కేసులో తీర్పు ఇచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నోయిడా ఎస్ఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధించింది. 2007-09 మధ్యకాలంలో తన పదవిని దుర్వినియోగం చేసి బ్యాంకుకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 2010లో ఆయనపై కేసు నమోదైంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బీహార్‌లో వేడెక్కుతున్న రాజకీయం !

**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
బీహార్ శాసనసభ ఎన్నికల వేళ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఆర్‌జెడి పరిపాలన నాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆర్జెడి నేత తేజస్వి యాదవ్ ఘాటుగానే స్పందించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో బీహార్‌కు ఒరిగిందేమిటని నిలదీశారు. ఇకపోతే ఇక్కడ ఎన్నికలను ఎదుర్కొంటున్న ఇండియా బ్లాక్ మహా ఠట్‌బంధన్ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను ఏకాభిప్రాయంతో ప్రకటించి అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎకి తిరుగులేని సవాల్ విసిరింది. అయితే కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు. అందుకే పలుచోట్ల పరస్పర పోటీకి దిగారు. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్‌జెడి ముందుకు వెళుతోంది. ఇవే అంశాలను ఎన్‌డిఎ ఎత్తిచూపు తోంది. వారిమధ్యన పొత్తులే సరిగా లేవని, అది మహాగట్‌బంధన్ ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది కూడా ముఖ్యం. పికె కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న ఈ రెండు కూటములను నిలవరించి ముందుకు రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. బీహార్‌లో గత దశాబ్దంన్నర పాలనా కాలంలో నితీష్ వేసిన వేషాలు అన్నీ ఇన్నీ కావు. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించిన చరిత్ర ఆయన స్వంతం. ఆయన విధానాన్ని బిజెపి అందివచ్చిన ప్రతిసారీ వల వేసి ఉపయోగించుకుంది. 2020 అక్టోబర్-నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా ఘట్‌బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్‌డిఎ తీర్థం పుచ్చుకొని పదవి కాపాడుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కావాల్సిన సీట్లు తగ్గగా తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి.



కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి చెబుతున్నదాంట్లో నిజం కనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. నితీశ్‌ను నమ్మినట్‌ఉ కనిపిస్తున్నా..ఎప్పుడైనా మింగేందుకు సిద్ధంగా ఉంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధిస్తే నితీశ్‌ను పక్కన పెట్టడం ఖాయమని తెలుస్తోంది. బిజెపి రాజీకయంగా వేసే ఎత్తుగడలు పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రుజువైంది. అందుకు తార్కాణం మహారాష్ట్రనే. సిఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ బిజెపికి ఎక్కువ సీట్లు రావడంతో సిఎం పదవిని బిజెపి తీసుకొని కూటమి పొత్తు ధర్మానికి నీళ్లొదిలింది. అటువంటిదే బీహార్‌లో నితీష్ విషయంలో బిజెపి చేయదని గ్యారంటీ లేదు. ఇకపోతే ఎన్నికలకు ముందుగానే తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడైన ముఖేష్ సహాని పేరును సైతం ప్రకటించి ఎన్నికల సమరానికి సై అంది. అయితే ఆర్‌జెడి గత పాపాలు వెన్నాడుతున్నాయి. లాలూ హయాంలో జరిగిన కుంభకోణాలు ఎన్నో ఉన్నాయి. తమ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో ఎలాంటి ఇబ్బందులూ లేవని డాంబికాలు పలుకుతున్న ఎన్‌డిఎ తమ సిఎం అభ్యర్థి ఎవరో ఎన్నికల అనంతరమే ప్రకటిస్తామని బిజెపి, అమిత్‌షా దాటవేస్తూ వచ్చారు. జెడియు చీఫ్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఎ ఎన్నికలకు వెళుతోందని అంటూనే, ఈ సారి నితీష్ సిఎం అవుతారన్న గ్యారంటీ లేదని చెప్పకనే చెప్పారు. దీన్నిబట్టి నితీష్ మెడపై బిజెపి కత్తి వేలాడతీసిందని అర్థమవుతుంది. బీహార్‌లో గెలిచేందుకు బిజెపి తొక్కని అడ్డదార్లు లేవు. ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్‌ఐఆర్)ను ప్రయోగించింది. ఇ.సి కి ఎంతమాత్రం సంబంధం లేని పౌరసత్వ నిర్ధారణ అంశాన్ని చేర్చేలా పావులు కదిపింది. దీనిపై ప్రతిపక్షాలు సుప్రీం కోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ఏకంగా 65 లక్షల ఓట్లు తొలగించారు. దీనిపై విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించినా ఇంకా పూర్తి స్థాయిలో విచారణ లేదు. ఓట్ల చోరీపై మహా గట్‌బంధన్ పెద్ద ఆందోళనే చేసింది. మహా గట్‌బంధన్‌కు సంబంధించి 11 సీట్లలో స్నేహ పూర్వక పోటీలు కొనసాగుతున్నాయి. నితీష్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని ఇప్పటికే ముందస్తు సర్వేలు చెప్తున్నాయి. బీహార్‌లో బిజెపి, దాని మిత్రులను ఓడిస్తేనే కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు కొంత మేరకైనా బ్రేకులు పడతాయని విపక్ష కాంగ్రెస్ భావిస్తోంది. ఆ లక్ష్య సాధన కోసం తమలోని చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరించుకొని మహా గట్‌బంధన్ పని చేయాలని వారు కోరుకుంటున్నారు. అయితే ఈసారి బీహార్‌లో ఎవరికీ అనుకూలంగా పరిస్థితి లేదు. అలాగే ఎవరిని ప్రజలు వ్యతిరేకిస్తున్నారో కూడా చెప్పలేక పోతున్నారు. ఈ దలు రేపటి ఎన్నికల్లో ప్రజలు ఎవరివైపు అన్నది వేచిచూడాలి.

# భారత్ ఒక గొప్ప ప్రజాస్వామ్య దేశం..

## నోబెల్ శాంతి బహుమతి విజేత ప్రశంసలు

**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
ఈ ఏడాది (2025) నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడో భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ ఒక 'గొప్ప ప్రజాస్వామ్యం' అని, ప్రపంచంలోని అనేక దేశాలకు 'ఒక ఉదాహరణ' అని ఆమె కొనియాడారు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడిన తర్వాత భారత్‌తో అన్ని రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, భారత్ తమకు గొప్ప మిత్రదేశం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడాలని ఆశిస్తున్నానని, స్వేచ్ఛాయుత వెనిజులాలో ఆయనకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నానని తెలిపారు.
గత 15 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె 'టైమ్స్ నౌ' వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎన్నో దేశాలకు, తరాలకు ఆదర్శంగా నిలిచింది. ఇది చాలా గొప్ప విషయం. ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు, దానిని నిరంతరం బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని ఎన్నో దేశాలు మీ వైపు చూస్తున్నాయి" అని ఆమె అన్నారు. తాను భారత్‌ను మనస్ఫూర్తిగా



ఆరాధిస్తానని, తన కుమార్తె కొన్ని నెలల క్రితమే భారత్‌ను సందర్శించిందని, అక్కడి సంస్కృతిని ఎంతో ఇష్టపడిందని ఆమె చెప్పారు. మహాత్ముడి అహింసాయుత పోరాటం తనకు స్ఫూర్తినిచ్చిందని, శాంతియుతంగా ఉండటం బలహీనత కాదని గాంధీ ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె పేర్కొన్నారు.
వెనిజులాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం గురించి మాట్లాడుతూ, 2024 జులై 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించినప్పటికీ, నికోలస్ మదురో ప్రభుత్వం ఫలితాలను తారుమారు చేసిందని ఆమె ఆరోపించారు. "విపక్షాల అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నేను 93 శాతం ఓట్లతో గెలిచాను. కానీ, నియంతృత్వ ప్రభుత్వం నన్ను పోటీ చేయనీయకుండా నిషేధం విధించింది. దాంతో, ఓ దౌత్యవేత్త మా తరఫున నిలబడ్డారు. మేము 70 శాతం ఓట్లతో గెలిచాం. దీనికి సంబంధించిన 85 శాతం ఓటింగ్ పత్రాలను డిజిటలైజ్ చేసి ఆధారాలుగా సేకరించాం. మేం గెలిచిన తర్వాత చర్చల ద్వారా అధికార మార్పిడికి మదురోకు అవకాశం ఇచ్చినా ఆయన నిరాకరించారు. ఆ తర్వాత దేశ చరిత్రలోనే అత్యంత దారుణమైన అణచివేతకు పాల్పడ్డారు. వేలాది మంది అమాయకులు అదృశ్యమయ్యారు. మహిళలు, చిన్నారులపై చిత్రహింసలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
వెనిజులాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమకు ప్రధాన మిత్రుడని మచాడో అభివర్ణించారు. అమెరికా, లాటిన్ అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో ఏర్పడుతున్న అంతర్జాతీయ కూటమితో మదురో పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఆమె అన్నారు. వెనిజులాలో నేరపూరిత సోషలిస్టు పాలన అంతమైన తర్వాత ఇంధనం, మౌలిక వసతులు, టెలికం వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భారత కంపెనీలకు గొప్ప అవకాశాలు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# ఏపీ మంత్రి సత్యకుమార్‌తో ఫలించిన చర్చలు ..

## సమ్మె విరమించిన పీహెచ్‌సీ వైద్యులు

అమరావతి,**అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు మూడు వారాలుగా కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మెకు ముగింపు లభించింది. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో జరిగిన చర్చల అనంతరం సంఘం నాయకులు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు.
తమ దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారంపై మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చినందున సమ్మెను విరమించినట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. పీజీ మెడికల్ ఇన్‌సర్వీస్ కోటా కొనసాగింపు, సర్వీసు సంబంధిత సమస్యలు, పదోన్నతులు, భత్యాలు వంటి అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. చర్చల్లో మంత్రి 2025-26 విద్యా సంవత్సరంలో పీజీ ఇన్‌సర్వీస్ కోటా 20 శాతం, అలాగే 2026-27లో 15 శాతం కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని హామీ



ఇచ్చారు. అలాగే గతంలో నిలిచిపోయిన డీఎన్బీ కోర్సుల్లో ప్రవేశాల అంశాన్ని పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, ట్రైబల్ అలవెన్స్, టైమ్ బౌండ్ ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్లు, అర్బన్ సర్వీస్ ఎలిజిబిలిటీ కాలాన్ని ఐదేళ్లకు కుదింపు, కొవిడ్ సమయంలో వేతనాలు అందని వారికి న్యాయం, అలాగే డిప్లొమా చేసిన వైద్యులు అదే స్పెషాల్టీలో ఉన్నత కోర్సులు (ఈఓఎల్) చేయగల అవకాశాలు వంటి అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.
సర్వీసు వ్యవహారాలకు సంబంధించిన నిర్ణయాల్లో వైద్య సంఘాల ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేసుకుంటామని మంత్రి స్పష్టం చేసినట్లు సంఘ నాయకులు తెలిపారు. సహచర వైద్యులతో చర్చించిన అనంతరం సమ్మెను విరమించాలనే నిర్ణయానికి వచ్చినట్లు పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నేతలు వెల్లడించారు. తమ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చూపిన సానుకూల వైఖరికి మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి గత నెల 28 నుంచి ఆందోళనలు చేపట్టిన పీహెచ్‌సీ వైద్యులు, ఈ నెల 3 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే.

# చిరు అనుమతి లేకుండా ఫోటోలు పేర్లు వాడరాదు

## హైదరాబాద్ సిటీసివల్ కోర్టు ఉత్తర్వులు జారీ

## పోస్టులు, వీడియోలు క్రియేట్ చేసిన 30మందికి నోటీసులు

హైదరాబాద్,**అక్టోబర్: 25 ప్రజావినికిడి, :** అగ్ర కథానాయకుడు చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను వాడకూడదని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక మాధ్యమాల వేదికగా తమ పేరు, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ



పలువురు అగ్ర నటులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఎఐ మార్ఫింగ్, వాయిస్ సింథసైజ్ ద్వారా ప్రతిష్ట దెబ్బతింటోందని నటీనటుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో చిరంజీవి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, చిరంజీవికి అనుకూలంగా తీర్పునిచ్చింది. టీఆర్పీ, లాభాల కోసం చిరంజీవి పేరును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో చిరంజీవి పేరును వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించవద్దని హెచ్చరించింది. మార్ఫింగ్ చేసిన డిజిటల్ వేదికలపై ఆంక్షలు విధించింది. ఇప్పటికే ఇలాంటి పోస్టులు, వీడియోలను క్రియేట్ చేసిన 30 మందికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 27కి వాయిదా వేసింది. తాజాగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ కలిసినప్పుడు ఇదే విషయమై చిరంజీవి ఫిర్యాదు చేశారు. దీనిని సమర్థంగా అమలులోకి తీసుకురావడానికి న్యాయ నిపుణుల సలహాలు కోరారు. ఇటువంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరంపై ఇరువురు చర్చించారు. న్యాయస్థానంలో తనకు అనుకూలంగా తీర్పు రావడంలో కృషి చేసిన అడ్వకేట్ ఎస్.నాగేశ్ రెడ్డి, ఆయన బృందానికి చిరు ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.ద

# కర్నూలు బస్సు ప్రమాదంతో అప్రమత్తం

## ఆర్‌టిఎ అధికారుల విస్తృత దాడులు

## ప్రైవేట్ ప్రయాణానికి దూరంగా ప్రజలు

హైదరాబాద్, **అక్టోబర్: 25 ప్రజావినికిడి, :** కర్నూల్ బస్సు ప్రమాదం తరువాత ఆర్టీఏ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. ఫిట్‌నెస్ లేని ప్రైవేటు బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు అధికారులు. నిబంధనలు పాటించని 12 బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు.. 8 బస్సులను సీజ్ చేశారు. మరోవైపు కర్నూల్ ప్రమాదం తరువాత ప్రైవేటు బస్సుల యాజమాన్యాల్లో కూడా చలనం వచ్చినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ లేని బస్సులను పెద్ద ఎత్తున నిలిపివేస్తున్న పరిస్థితి. ముందుగా బుక్ చేసిన టికెట్లను కూడా ప్రైవేటు ట్రావెల్స్ రద్దు చేస్తున్నాయి. వీకెండ్ కావడంతో ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణికులు భారీగా బుకింగ్ చేసుకున్నారు. అయితే ఫిట్‌నెస్ లేని బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులపై ఆర్టఏ చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో భారీగా బస్సులను యాజమాన్యాలు నిలిపివేస్తున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బెంగళూరులో కూడా ఆర్టీఏ అధికారులు భారీగా బస్సులను సీజ్ చేస్తున్నారు. తెలంగాణలో వారం రోజులు పాటు స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగనున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు పెద్ద ఎత్తున బుకింగ్‌లను రద్దు చేయడంతో ఆర్టీసీకి గిరాకీ పెరిగింది.

# ఎపి ప్రగతిలో కొత్త బాగస్వామ్యం

## ఆస్ట్రేలియా పర్యటనపై లోకేశ్

హైదరాబాద్, **అక్టోబర్: 25 ప్రజావినికిడి,** ఆస్ట్రేలియాలో 7 రోజుల పర్యటనతో.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి దిశగా కొత్త భాగస్వామ్యాలపై నమ్మకం కుదిరిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నాలుగు నగరాల పర్యటనలో విశ్వవిద్యాలయాల సందర్శన, పారిశ్రామికవేత్తలతో భేటీలు జరిగాయని తెలిపారు. క్రీడలను శక్తిమంతమైన రంగంగా అభివృద్ధి చేసే అవకాశాలు విస్తారంగా ఉన్నాయన్నారు. భారతదేశం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు సాగుతోందని చెప్పారు. ఈ సమయంలో, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శక్తి బలోపేతం కావడం కీలకమని పేర్కొన్నారు. ఈ పర్యటన ఫలాలు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనకరమైన భాగస్వామ్యాలుగా మారతాయని లోకేశ్ ఆకాంక్షించారు.

# ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

## ఒడియా నవల 'దాడిబుధ' తెలుగు అనువాదానికి గౌరవం

## 'ఈతచెట్టు దేవుడు' పేరుతో అనువదించిన రాజేశ్వరి



అమరావతి, **అక్టోబర్: 25 ప్రజావినికిడి,**
ప్రముఖ తెలుగు రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారాన్ని అందుకున్నారు. ప్రఖ్యాత ఒడియా రచయిత గోపీనాథ్ మహంతి రచించిన 'దాడిబుధ' నవలను 'ఈతచెట్టు దేవుడు' పేరుతో ఆమె తెలుగులోకి అనువదించినందుకు గాను ఈ గౌరవం దక్కింది. కోల్‌కతాలోని జాతీయ లైబ్రరీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు.
ఈ పురస్కారం కింద రాజేశ్వరికి రూ. 50 వేల నగదు, తామ్రపత్రం అందజేసి సత్కరించారు. ఈ నవల ఒడిశాలోని కోరాపుట్ జిల్లా లుల్లా అనే గిరిజన గ్రామం నేపథ్యంలో సాగుతుంది. అటవీ ప్రాంతంలో వన్యమృగాల భయం మధ్య జీవించే గిరిజనుల జీవనశైలి, వారి సంస్కృతి, నమ్మకాలను ఈ నవలలో రచయిత కళ్లకు కట్టినట్టు చూపించారు. 1947 ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో తుర్లపాటి రాజేశ్వరి జన్మించారు. గత ఐదు దశాబ్దాలుగా ఆమె ఒడిశాలోని బరంపురంలో నివసిస్తూ, ఒడియా సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నారు. ఆమె కవిత్వం, పరిశోధనా వ్యాసాలతో పాటు అనేక ఒడియా రచనలను తెలుగులోకి అనువదించి మంచి పేరు సంపాదించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజేశ్వరి చేసిన అనువాదం చాలా సరళంగా, మూల రచనలోని జీవం చెడకుండా, అందరికీ అర్థమయ్యే శైలిలో ఉందని ప్రశంసించారు.

# ఆఖరి వన్డేలో భారత్ ఘన విజయం

- టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శన
- 38.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో విధ్వంసం
- కోహ్లీ అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు




ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను భారత్ విజయంతో ముగించింది. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (121), విరాట్ కోహ్లీ (74) చెలరేగడంతో 237 పరుగుల లక్ష్యాన్ని భారత్ 38.3 ఓవర్లలోనే ఛేదించింది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 1 వికెట్ దక్కించుకున్నాడు. సెంచరీతో కదం తొక్కిన రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 237 లక్ష్య ఛేదనను రోహిత్- గిల్ ధాటిగానే ఆరంభించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (24), రోహిత్ బౌండరీలు బాదడంతో జట్టు స్కోర్ 10 ఓవర్లకు 60 దాటింది. ఈ దశలో గిల్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేశారు. ఆ తర్వాత ఆసీస్‌కు మరో వికెట్ దక్కలేదు. విరాట్ కోహ్లీతో రోహిత్ చాలా రోజుల తర్వాత భారీ పార్ట్‌నర్‌షిప్ నిర్మించాడు. ఈ ఇద్దరూ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే రోహిత్ సెంచరీ, విరాట్ హాఫ్ సెంచరీ పూర్తి చేశారు.వన్డేల్లో హిట్‌మ్యాన్‌కు ఇది 33వ శతకం కావడం విశేషం. అటు విరాట్‌కు ఇది 75వ వన్డే హాఫ్ సెంచరీ. సెంచరీ తర్వాత రోహిత్ స్పీడ్ పెంచాడు. మ్యాథ్యూ షార్ట్ వేసిన 38వ ఓవర్లో రోహిత్ సిక్స్, ఫోర్ బాదగా, ఆ తర్వాతి ఓవర్లో విరాట్ బౌండరీ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. రో- కో జోడీ ఈ ఇన్నింగ్స్‌తో అభిమానులకు ట్రీట్ ఇచ్చింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రేన్‌షా(58 బంతుల్లో 2 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(41), మాథ్యూ షార్ట్(30) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా(4/39) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. వాషింగ్టన్ సుందర్(2/44) రెండు వికెట్లు పడగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు ఆసీస్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్(29), మిచెల్ మార్ష్(41) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించిన అనంతరం సిరాజ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి పవర్ ప్లేలో ఆసీస్ వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. అనంతరం మాథ్యూ షార్ట్‌తో కలిసి మిచెల్ మార్ష్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశాడు. కానీ హాఫ్ సెంచరీకి చేరువైన అతన్ని అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేసి పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే మాథ్యూ షార్ట్(30)ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా.. అలెక్స్ క్యారీ(24)ని శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ క్యాచ్‌తో హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ఈ క్యాచ్ అందుకునే క్రమంలో అయ్యర్ పక్కటెముకలకు తీవ్ర గాయమైంది. ఓవైపు వికెట్లు పడినా మరోవైపు మ్యాట్ రేన్‌షా 48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని వాషింగ్టన్ సుందర్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. ఆ వెంటనే మిచెల్ ఓవెన్‌ను హర్షిత్ రాణా ఔట్ చేయగా.. మిచెల్ స్టార్క్‌ను కుల్దీప్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. నాథన్ ఎల్లిస్(16)ను ప్రసిధ్ కృష్ణ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆడమ్ జంపాతో కలిసి కూపర్ కాన్లీ కాసేపు పోరాడాడు. ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో బౌండరీలు రాబట్టాడు. అతనితో పాటు జోష్ హాజెల్ వుడ్(0)ను ఔట్ చేసిన హర్షిత్ రాణా ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు 69 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) మరోసారి విఫలమవ్వగా.. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. బుధవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. 237 పరుగుల స్వల్ప లక్ష్యచేధనలో టీమిండియాకు శుభారంభం దక్కింది. శుభ్‌మన్ గిల్(24) త్వరగానే ఔటైనా... తొలి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం లభించింది. క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీతో కలిసి రోహిత్ శర్మ చెలరేగాడు. 63 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగాడు. 56 బంతుల్లో కోహ్లీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. రోహిత్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకు న్నాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు 168 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు.

## వన్డేల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన కోహ్లీ




భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్ చరిత్రలో మరో అరుదైన మైలురాయిని అధిగమించాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు చేసిన కోహ్లీ, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర రికార్డును బద్దలు కొట్టి వన్డే చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ ఘనత సాధించడం ద్వారా కోహ్లీ తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ తర్వాత నిలిచిన ఏకైక ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఆఖరి వన్డేలో మెరుపు హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా విరాట్ కోహ్లీ.. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించాడు. ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లీ సంగక్కర రికార్డును బ్రేక్ చేయడానికి 54 పరుగులు చేయాల్సి వచ్చింది. కుమార సంగక్కర 404 వన్డేల్లో 14,234 పరుగులు చేశాడు. కోహ్లీ తన 293వ వన్డే ఇన్నింగ్స్‌లోనే 14,255లి పరుగులు చేసి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను అజేయంగా 74 పరుగులు చేసి, భారత్‌కు 9 వికెట్ల విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ ఇప్పుడు తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ వెనకే నిలిచాడు. సచిన్ టెండూల్కర్ 452 ఇన్నింగ్స్‌లలో 18,426 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ సాధించిన ఈ రికార్డుకు అతని అద్భుతమైన యావరేజ్ బలం. వన్డే చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన టాప్ 10 బ్యాటర్లలో 50 కంటే ఎక్కువ సగటు (దాదాపు 57.69) ఉన్న ఏకైక ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. సచిన్ సగటు 44.83గా ఉంది. వన్డేలు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లను కలిపి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో కూడా కోహ్లీ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు.ఈ ప్రదర్శనతో కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో 75వ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అంతేకాకుండా, ఆస్ట్రేలియాపై వన్డేలలో 2500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. రోహిత్ శర్మతో కలిసి 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్ విజయాన్ని సులభతరం చేశాడు. తన కెరీర్ చివర్లో ఉన్నప్పటికీ, కోహ్లీ తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ తర్వాత స్థానంలో నిలిచి తన వన్డే కెరీర్‌ను ముగించే అవకాశం ఉంది.

## సమష్టి ప్రదర్శనతోనే విజయం

- రోహిత్, కోహ్లీ బ్యాటింగ్ అద్భుతం
- టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్




సమష్టి ప్రదర్శనతోనే ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డేలో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఇది పర్‌ఫెక్ట్ గేమ్ అని, కెప్టెన్‌గా ఈ విజయం తనకు ప్రత్యేకమైనదని తెలిపాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది.టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. ఈ ఇద్దరి సూపర్ బ్యాటింగ్‌తో టీమిండియా చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఆసీస్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. సంతోషం వ్యక్తం చేశాడు. రోహిత్, కోహ్లీ బ్యాటింగ్ అద్భుతమని, బౌలింగ్‌లో హర్షిత్ రాణా స్పిన్నర్లు రాణించారని కొనియాడాడు. 'మాకు ఇది పర్‌ఫెక్ట్ గేమ్. మిడిల్ ఓవర్లలోనే మ్యాచ్‌పై పట్టు బిగించాం. ఛేజింగ్ చూడముచ్చటగా అనిపించింది. మా స్పిన్నర్లు పరుగులు ఇవ్వకుండా కట్టడి చేశారు. పేసర్లు కీలక వికెట్లు తీసారు. మిడిల్ ఓవర్లలో హర్షిత్ రాణా వేగంగా బౌలింగ్ చేశాడు. ఇలాంటి క్వాలిటీ బౌలింగ్ మాకు అవసరం. రోహిత్, కోహ్లీ చాలా ఏళ్లుగా ఇలాంటి విజయాలు అందించారు. వారి ఆటను చూడటం చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రత్యేకమైన మైదానంలో ఈ విజయం దక్కడం గొప్ప విషయం'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రేన్‌షా(58 బంతుల్లో 2 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(41), మాథ్యూ షార్ట్(30) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా(4/39) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. వాషింగ్టన్ సుందర్(2/44) రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు 69 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) మరోసారి విఫలమవ్వగా.. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. బుధవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది.

## మిడిలార్డర్ వైఫల్యంతోనే ఓటమి

- ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్




మిడిలార్డర్ వైఫల్యం తమ ఓటమిని శాసించిందని ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ అన్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. ఈ ఇద్దరి సూపర్ బ్యాటింగ్‌తో టీమిండియా చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఆసీస్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన మిచెల్ మార్ష్.. అద్భుతమైన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయామని చెప్పాడు. రోహిత్, కోహ్లీ అసాధారణ ప్రదర్శన కనబర్చారని కొనియాడాడు. 'గత 10 ఏళ్లుగా రోహిత్, విరాట్ కోహ్లీలు చాలా జట్లపై మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేయడం చూశాం. ఈ మ్యాచ్‌లోనూ వారు అదే తరహా ప్రదర్శన కనబర్చారు.మా బ్యాటింగ్‌లో మరో భాగస్వామ్యం నమోదు చేస్తే ఫలితం మరోలా ఉండేది. 3 వికెట్లకు 195 పరుగులతో గొప్ప ప్లాట్ ఫామ్ దొరికింది. కానీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయాం. బ్యాటింగ్‌లో భారత్ అద్భుతంగా ఆడింది. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఈ సిరీస్ గెలిచినందుకు సంతోషంగా ఉంది.'అని మిచెల్ మార్ష్ చెప్పుకొచ్చాడు.

## మేం మళ్లీ ఆడుతామో లేదో తెలియదు

- రోహిత్ శర్మ సంచలన వ్యాఖ్యలు

తాను, విరాట్ కోహ్లీ మళ్లీ ఆస్ట్రేలియా పర్యటనలో ఆడుతామో లేదో తెలియదని టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. కానీ ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన ప్రతీ క్షణాన్ని ఆస్వాదించామని హిట్ మ్యాన్ చెప్పుకొచ్చాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయానంతరం దిగ్గజ క్రికెటర్లు రవి శాస్త్రి, ఆడమ్ గిల్‌క్రిస్ట్‌లతో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాకు హిట్ మ్యాన్ ధన్యవాదాలు తెలిపాడు.'నాకు ఆస్ట్రేలియా పర్యటనకు రావడం ఎప్పుడూ ఇష్టమే. సిడ్నీ వేదికగా ఆడటం సంతోషంగా ఉంటుంది. నా తొలి ఆసీస్ పర్యటన 2008 నుంచి మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ పర్యటన కూడా చాలా సరదాగా గడిచింది. మేం మళ్లీ క్రికెటర్లుగా ఆసీస్‌కు వస్తామో లేదో తెలియదు. కానీ నేను ఈ గడ్డపై ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాను. గత 15 ఏళ్లలో మేం సాధించిన ఘనతల కంటే క్రికెట్ ఆడటాన్ని ఎక్కువగా ఆస్వాదించాం.



# ఖైదీ-2 సీక్వెల్‌లో బిజీగా లోకేశ్ కనగరాజ్

దర్శకుడు లోకేష్ కనగరాజ్ చివరిగా రజనీకాంత్ హీరోగా కూలీ అనే సినిమా చేశాడు. అతని గత సినిమాలతో పోలిస్తే, ఆ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. చెప్పుకోదగ్గ కలెక్షన్స్ వచ్చాయి, కానీ లోకేష్ కెరీర్‌లోనే అది వీకెస్ట్ వర్క్ అనే ముద్ర పడింది. ఈ సినిమా తర్వాత కమల్ హాసన్, రజనీకాంత్ కలిసి చేస్తున్న సినిమా కూడా లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తాడని అందరూ భావించారు. అయితే, అది నిజం కాదని తర్వాత తెలిసింది. అయితే, ఎట్టకేలకు మరోసారి రజనీకాంత్ అనే సినిమా చేసి హిట్ కొట్టాలని ఆయన ప్రయత్నం చేసినట్టు కూడా వార్తలు వచ్చాయి. అయితే, ఆ వార్తలన్నీ కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయి. తాజాగా అందుతున్న సమాచారం మేరకు, లోకేష్ తన తర్వాతి సినిమాగా కార్తి హీరోగా నటించిన ఖైదీ సినిమాకి సీక్వెల్‌గా ఖైదీ 2 చేయబోతున్నాడు. ఈ సినిమా లోకేష్ కనగరాజ్ సినిమాకి యూనివర్స్‌లో భాగంగా ఉండబోతోంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు మొదలైనట్లుగా అధికారిక సమాచారం. కార్తి హీరోగా వచ్చిన ఖైదీ సినిమా అప్పట్లో పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దానికి సీక్వెల్‌గా ప్లాన్ చేస్తున్నా, ఖైదీ 2 ఎలా ఉండబోతుందా అని ఆసక్తి రేగుతోంది.

# పురుషాధిక్యంలో మౌనమే సమాధానం

## కాజోల్ టాక్ షోలో జాన్వీ ఆసక్తికర విషయాలు

పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సిందేనని నటి జాన్వీకపూర్ అభిప్రాయపడ్డారు. తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్-బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.



# రాజాసాబా ప్రమోషన్‌లో కొత్త ఒరవడి

## ప్రత్యేకంగా షూట్ చేస్తున్న ప్రమోషన్ వీడియో

ప్రభాస్ అభిమానులకు, సినీ ప్రేక్షకులకు ఒక ఆసక్తికరమైన వార్త తెర మీదకు వచ్చింది. 'రాజా సాబ్' సినిమా విడుదలకు ముందు చిత్ర యూనిట్ మరో ట్రైలర్‌ను విడుదల చేయాలని యోచిస్తోంది. అయితే, ఈసారి ట్రైలర్ విషయంలో దర్శకుడు మారుతి ఒక సరికొత్త పద్ధతిని అనుసరించబోతున్నారు. సాధారణంగా సినిమాలలోని కీ షాట్స్‌తో ట్రైలర్ కట్ చేస్తుంటారు. కానీ, 'రాజా సాబ్' కోసం విడుదల చేయబోయే ఈ రెండో ట్రైలర్‌ను సినిమాలోని సన్నివేశాలతో కాకుండా, దీనికోసం స్పెషల్‌గా షూట్ చేయాలని దర్శకుడు మారుతి భావిస్తున్నారు. ఈ స్పెషల్ వీడియో ప్రమోషనల్ వీడియోలా ఉంటూనే, పూర్తిస్థాయి ట్రైలర్ అంత ఎఫెక్ట్‌ను కలిగించేలా డిజైన్ చేయబోతున్నారు. ఓ రకంగా చూస్తే, సినిమా ప్రమోషన్స్‌లో 'రాజా సాబ్' తో ఒక కొత్త ట్రెండ్ మొదలు కావచ్చు. అయితే ఇది పూర్తిగా కొత్త స్ట్రాటజీ అని చెప్పలేం. ఎందుకంటే సినిమా మీద ఆసక్తి కలిగించేలా ఉన్నా కొన్ని డైలాగ్స్, షాట్స్ తో చేసిన కొన్ని ట్రైలర్స్ ఇప్పటికే రిలీజ్ చేసి తర్వాత సినిమాలో అవి లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ సినిమా విషయంలో కూడా దాదాపుగా అదే స్ట్రాటజీ ఫాలో అవ్వబోతున్నారు. ఈ వినూత్న ప్రమోషనల్ స్ట్రాటజీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.






# రెండులారీల థాంక్స్.. అల్లు అర్జున్‌కు శివ రిప్లై

నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం శివ నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ ప్రత్యేక వీడియో విడుదల చేశారు. తెలుగు ఇండస్ట్రీ గురించి చెప్పాల్సి వస్తే.. 'శివ'కు ముందు.. తర్వాత అని చెబుతారని అన్నారు. ఈ రీరిలీజ్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి రెండు లారీల పేపర్స్ తీసుకెళ్లండి అని అభిమానులకు చెప్పారు. ఈ వీడియోను పోస్ట్ చేసిన నాగార్జున.. 'డియర్ అల్లు అర్జున్ .. రెండు లారీల థాంక్స్..' అని క్యాప్షన్ పెట్టారు.



# పెళ్లి విషయంలో ఓపెన్ అయిన ముద్దుగుమ్మ

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం పూర్తి చేసుకుంది. 2015 సంవత్సరంలో మలయాళం మూవీ ప్రేమమ్‌తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసింది. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడు మలయాళ సినిమాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు. కానీ లక్కీగా ఈ అమ్మడికి మొదటగా తమిళ్‌లో కోడి అనే సినిమాలో ఛాన్స్ దక్కింది. ఆ సినిమా తర్వాత తెలుగులో అ ఆ, ప్రేమమ్ సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే మంచి స్టార్డం దక్కించుకుంది. అ ఆ సినిమాలో అనుపమ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో అంతా ఆమెను అభిమానించడం మొదలు పెట్టారు, ఆ తర్వాత ప్రేమమ్ సినిమా ఆమె స్థాయిని మరింతగా పెంచేసింది. ప్రేమమ్‌తో టాలీవుడ్‌లో ఎంట్రీ తెలుగులో ఈమె 2017లో చేసిన శతమానం భవతి సూపర్ హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసే అవకాశం రాలేదు. ఇప్పటికీ టాలీవుడ్, కోలీవుడ్, మలయాళం ఇలా అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంది. దక్షిణాదిన అన్ని భాషల్లో నటించిన హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నిలిచింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు సైతం ఈమెకు ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల ఈమె పరదా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో మంచి కాన్సెప్ట్‌ను చూపించినా కమర్షియల్‌గా నిరాశ పరిచింది. అయినా కూడా ఈ అమ్మడి క్రేజ్ తగ్గలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఒకటి రెండు షూటింగ్ దశలో ఉంటే కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్లుగా సమాచారం అందుతోంది. అనుపమ పరమేశ్వరన్ పెళ్లి విషయంలో... ఈ ఏడాది ఏకంగా ఆరు సినిమాలతో వచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన పెళ్లి విషయమై ఓపెన్ అయింది. మూడు పదుల వయసుకు చేరువ అవుతున్న నేపథ్యంలో అనుపమ పరమేశ్వరన్ పెళ్లి ఎప్పుడు అంటూ చాలా మంది అడుగుతూ ఉన్నారు. ఆ మధ్య అనుపమ పరమేశ్వరన్ ప్రేమలో ఉందనే వార్తలు తెగ వచ్చాయి. కానీ అవి పుకార్లే అని ఆ తర్వాత క్లారిటీ వచ్చింది. అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక చిట్ చాట్ సందర్భంగా ప్రేమ వివాహం గురించి స్పందించి అందరిని సర్‌ప్రైజ్ చేసింది. ప్రేమలో లేదని అంతా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ అమ్మడు తాను ప్రేమ వివాహం చేసుకుంటాను అని చెప్పడం ద్వారా కచ్చితంగా ఈమె ప్రేమలో ఉందని కొత్త ప్రచారం మొదలు అయింది. అయితే ఆమె మాత్రం ప్రేమ ఉన్నట్లు మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. లవ్ మ్యారేజ్‌పై అనుపమ క్లారిటీ కుటుంబ సభ్యులను ఒప్పించిన తర్వాత మాత్రమే తాను ప్రేమ వివాహం చేసుకుంటాను అన్నట్లుగా అనుపమ చెప్పడంతో ఆమె పెళ్లి విషయమై క్లారిటీ ఇచ్చినట్లు అయింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613